క్లుప్తంగా

పీవీటీజీ సర్వే త్వరితగతిన పూర్తి



మాట్లాడుతున్న ఎంపీడీవో ఆశాజ్యోతి

చింతపల్లి రూరల్: పీవీటీజీల సర్వే త్వరితగతిన పూర్తి చేయాలని సచివాలయ సిబ్బందిని ఎంపీడీవో ఆశాజ్యోతి ఆదేశించారు. సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ కార్యదర్శులు, సచివాలయ సిబ్బందితో ఆమె సమీక్షించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో మాట్లాడుతూ పీవీటీజీల వివరాలు త్వరగా సేకరించి తమకు నివేదిక ఇవ్వాలన్నారు. సచివాలయ సిబ్బంది సమయపాలన తప్పనిసరిగా పాటించాలని, లేకుంటే తగిన చర్యలు తీసుకోవాల్సి వస్తుందన్నారు. రోజూ మూడు పూటలు బయోమెట్రిక్ వేయాలన్నారు. ఈవోపీఆర్డీ శ్రీనివాస్, సిబ్బంది పాల్గొన్నారు.

నేడు గడప గడపకు మన ప్రభుత్వం

జి.మాడుగుల: బొయితిలి గ్రామ సచివాలయం పరిధి దిగరాపల్లి, జాములవీధి కాలనీ, తోకగరువు, దిగరాపల్లి కాలనీ, జాములవీధి కాలనీ, బొయితిలి, మద్దిగరువు గ్రామాల్లో మంగళవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించనున్నట్లు వైఎస్సార్‌సీపీ మండలాధ్యక్షుడు నుర్మని మత్స్యకొండం నాయుడు, లువ్వాసింగి ఎంపీటీసీ గబ్బాడి సన్యాసిదొర తెలిపారు. పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి ఆయా గ్రామాల్లో పర్యటిస్తారన్నారు. ఏపీ ట్రైకార్ చైర్మన్, జెడ్పీటీసీ, వైస్ ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, మార్కెట్ కమిటీ చైర్మన్, వివిధ నామినేటెడ్ సభ్యులు, మాజీ సర్పంచ్‌లు, పార్టీ శ్రేణులు హాజరు కావాలని కోరారు.

రోడ్డు మరమ్మతు చేయాలి



మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు గంగరాజు తదితరులు

అనంతగిరి: మండలంలోని కోనపురంలో జెడ్పీటీసీ సభ్యుడు గంగరాజు సోమవారం పర్యటించారు. స్థానికులు గ్రామ రహదారి సమస్యను తెలియజేశారు. పదేళ్ల క్రితం రోడ్డు కావడంతో పాడైందని, బాగుచేయాలని గ్రామస్తులు కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డును మరమ్మతు చేయాలన్నారు. ఈ సమస్యను కలెక్టర్ సుమిత్‌కుమార్ దృష్టికి తీసుకెళ్తామన్నారు. టోకూరు సర్పంచ్ మోస్య, నాయకులు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ బీమా అందజేత



బీమా నగదును బాధిత కుటుంబానికి అందజేస్తున్న సర్పంచ్ రాంబాబు

ఎటపాక: మండలంలోని పిచుకలపాడు సచివాలయంలో బాధిత కుటుంబానికి వైఎస్సార్ బీమా తక్షణ సాయం అందజేశారు. నూపా ముత్త ఇటీవల సహజ మరణం చెందడంతో ఆయన భార్య నామినికి తక్షణ సాయంగా రూ.10వేల నగదును సర్పంచ్ రాంబాబు చేతుల మీదుగా సోమవారం అందించారు.సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

తాగునీటి పైపులైన్‌కు మరమ్మతులు



మరమ్మతు పనులు చేస్తున్న ఉప సర్పంచ్ సీతారాం, గ్రామస్తులు

ముంచంగిపుట్టు: మండలంలోని వనుగుమ్మ పంచాయతీ కేంద్రంలో పాడైన తాగునీటి పైపులైనుకు వైస్ ఎంపీపీ భాగ్యవతి, ఉప సర్పంచ సీతారాం, గ్రామస్తులు సోమవారం బాగు చేశారు. గత కొన్ని రోజులుగా తాగునీటి పైపులైన్ దెబ్బతిన్న విషయాన్ని సంబంధిత అధికారులకు తెలియజేసినా పట్టించుకోక పోవడం వల్ల గ్రామస్తుల సహకారంతో వైస్ ఎంపీపీ, ఉప సర్పంచ్‌లు శ్రమదానంతో బాగు చేశారు. నీటి సరఫరా జరిగే విధంగా చర్యలు తీసుకున్నారు. గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

గడప గడపకు సంక్షేమం

- మారుమూల గ్రామాలను సందర్శించిన తొలి ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి
- గడప గడపకు విశేష స్పందన



గ్రామస్తులకు సంక్షేమ పథకాల బ్రోచర్‌ను అందజేస్తున్న పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి

పాడేరు రూరల్ : అవి పాడేరు–మాడుగుల నియోజకవర్గ సరిహద్దు మారుమూల గ్రామాలు, ఆ గ్రామాలకు ఓ ఎమ్మెల్యే సందర్శించిన దాఖలాలు ఎన్నడు లేదు... ప్రజల ఓట్లతో ఎన్నికైన ఎమ్మెల్యే వ్యక్తులు గత ప్రభుత్వాల హయాంలో మారుమూల గిరిజన గ్రామాలను సందర్శించి వారి యోగక్షేమాలు తెలుసుకున్న సందర్భాలు ఎన్నడూ లేదు...కానీ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఎమ్మెల్యేలు నేరుగా గ్రామాలకు వెళ్లి ప్రజల కష్టసుఖాలను తెలుసుకుని వారు ఎదుర్కొంటున్న సమస్యలపై ఆరా తీసి పరిష్కరిస్తామన్నారు. తాజాగా పాడేరు ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి పాడేరు–మాడుగుల అసెంబ్లీ నియోజకవర్గాల సరిహద్దు గ్రామాలైన తుమ్మలపాలెం, మూలగలపాలెం, అర్జాపురం, జబర్తి గ్రామాల్లో సోమవారం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. ఆమెకు గ్రామస్తులు ఘన స్వాగతం పలికారు. ఇందులో భాగంగా ఆయా గ్రామాల్లో 280 గడపలను ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి సందర్శించారు. ఇంటింటికీ వెళ్లి యోగక్షేమాలు, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను గ్రామస్తులకు వివరించారు. సంక్షేమ పథకాలు అందని వారు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి మాట్లాడుతూ ప్రభుత్వం పారదర్శకంగా, పార్టీలకతీతంగా అన్ని వర్గాలకు సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. గిరిజన ప్రాంతాల్లో అభివృద్ధిపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించారన్నారు. ప్రజా సమస్యలను తన దృష్టికి తీసుకొస్తే పరిష్కరిస్తామన్నారు. రానున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీకి మద్దతు తెలిపి, మరలా జగనన్నను ముఖ్యమంత్రిగా గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో భాగంగా గ్రామాల్లో తాగునీరు, డ్రైనేజీ సమస్యలను స్థానికులు ఎమ్మెల్యేకు తెలియజేశారు. సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి హామీ ఇచ్చారు. అనంతరం గ్రామస్తులు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మిను దుశ్శాలువ కప్పి ఘనంగా సన్మానించారు. సర్పంచ్‌లు పాంగి రాంబాబు, కిల్లో పరమేశ్వరి, గెమ్మెలి అప్పలకొండ, వనుగు బసవన్న దొర, కొర్రా మంగమ్మ, ఎంపీటీసీ సభ్యులు మువ్వల మీనా, కుంతూరు నర్సింహమూర్తి , లకే రామకష్ణపాత్రుడు, జి.మాడుగుల పీఏసీఎస్ చైర్మన్ నుర్మాని మత్స్యకొండం నాయుడు, నాయకులు కన్నపాత్రుడు, కష్టం నాయుడు, గంగరాజు, దశమూర్తి, పోతురాజు, రవి, గోపి, బాబూరావు, సత్యనారాయణ, ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ ఘటనపై శాంతి ర్యాలీ



దుంబ్రిగుడలో ర్యాలీ చేస్తున్న పాస్టర్లు, క్రైస్తవులు

దుంబ్రిగుడ: మణిపూర్‌లో ఓ వర్గంపై దాడులకు నిరసనగా పాస్టర్ల ఫెలోషిప్ ఆధ్వర్యంలో మండలంలోని 18 పంచాయతీల క్రైస్తవులు సోమవారం స్థానిక అరకు–పాడేరు ప్రధాన రహదారిలో భారీ ర్యాలీలో నిర్వహించారు. అనంతరం స్థానిక తహసీల్దార్ నాగమ్మకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా బాబూరావు, బాలాజీ మాట్లాడుతూ మణిపూర్‌లో మతం పేరుతో చిత్రహింసలు పెడుతున్న వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పాస్టర్ల సంఘం కన్వీనర్ హెచ్.బి. జాన్ విన్సెంట్, అధ్యక్షుడు కృష్ణదాస్, వ్యవస్థాపకుడు జాన్, గౌరవాధ్యక్షుడు మనష్షే, కార్యదర్శి సునీల్, కోశాధికారి తిమోతి, మానవ హక్కుల నేర నిరోధక సంఘం అధ్యక్షురాలు కృష్ణకుమారి, ధర్మ పాల్గొన్నారు.

సంతోష్‌నగర్ రహదారికి మోక్షం

రూ.5 లక్షలతో సీసీ రోడ్డు పనులు ప్రారంభం



సీసీ రోడ్డు పనులు ప్రారంభిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

అరకులోయ రూరల్: సంతోష్‌నగర్ కాలనీ రహదారికి ఎట్టకేలకు మోక్షం కలిగిందని సర్పంచ్ పెట్టేలి సుస్మిత తెలిపారు. పద్మపురం పంచాయతీ సంతోష్ నగర్ కాలనీకు వెళ్లే రోడ్డు నిర్మాణానికి ఎమ్మెల్యే చెట్టి పాల్గుణ చొరవతో రూ.5 లక్షలు మంజూరయ్యాయి. ఈ మేరకు సోమవారం ఆమె పార్టీ శ్రేణులతో కలిసి కొబ్బరి కాయలు కొట్టి సీసీరోడ్డు పనులు ప్రాంభించారు. గత ప్రభుత్వ హయాం నుంచి కాలనీకి రహదారి సౌకర్యం లేక ప్రజలు ఎంతో ఇబ్బందులు పడేవారన్నారు. ప్రస్తుత ప్రభుత్వంలో ఎమ్మెల్యే చొరవతో రహదారి సదుపాయం కలుగుతుండటంతో కాలనీ వాసులు కృతజ్ఞతలు తెలిపారు. ఏఎంసీ చైర్మన్ కిల్లో రాజారమేష్, ఎంపీటీసీ సభ్యుడు భీమరాజు, వైస్ సర్పంచ్ శెట్టి నీలవేణి, కోఆప్షన్ సభ్యుడు రహీంతుల్లా, పార్టీ సీనియర్ నాయకులు ముఖి సాంబ, శెట్టి వెంకటరావు, నర్సింగ్, రాజ్‌కుమార్, సుంక్ర, చందుపాడి పాల్గొన్నారు.

కష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు



టెన్త్ టాపర్లకు బహుమతులు అందజేస్తున్న పూర్వ విద్యార్థులు

రాజవొమ్మంగి: కష్టపడి చదివితే ఉత్తమ ఫలితాలు సాధించవచ్చని స్థానిక అల్లూరి సీతారామరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల హెచ్ఎం గోపాలకృష్ణ విద్యార్థులకు పిలుపునిచ్చారు. పాఠశాలలో సోమవారం ఏర్పాటైన పూర్వ విద్యార్థులు–ప్రస్తుత విద్యార్థుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రతి విద్యార్థి తరగతులు ప్రారంభం నుంచే ఎప్పటికప్పుడు సబ్జెక్టులపై పట్టు సాధించాలని, చదువుపై దృష్టి సారించాలని హితవు పలికారు. టీవీలకు, సెల్ ఫోన్లకు దూరంగా ఉండాలన్నారు. కార్యక్రమంలో భాగంగా 2023 టెన్త్ పరీక్షల్లో అత్యుత్తమ ఫలితాలు సాధించినవ విద్యార్థులు మిరియా చరణ్‌తేజ్, ముజాహిద్, యలమంచలి రాజులకు పాఠశాల పూర్వ విద్యార్థులు (1992–93 బ్యాచ్) నగదు బహుమతితో పాటు జ్ఞాపికలను అందజేశారు. సబ్జెక్టుల వారీగా మంచి ఫలితాలను సాధించిన వారిని గుర్తించి వారికి కూడా జ్ఞాపికలు బహూకరించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు ఐఐటీ, నీట్ ప్రవేశపరీక్షలకు శిక్షణ ఇచ్చేందుకు కూడా తమ వంతు ప్రోత్సహిస్తామని పూర్వ విద్యార్థులు కె.శ్రీనివాసశర్మ, పి.శ్రీనివాస్, బి.నాగేశ్వరరావు, ప్రసాద్ తదితరులు ప్రకటించారు. పూర్వ విద్యార్థి భోజనపల్లి ప్రసాద్ పాఠశాలకు మెగా ఫోన్‌ను అందజేశారు. చప్పా సత్యనారాయణ, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

చిన్నారులకు పరామర్శ



కేజీహెచ్‌లోని చిన్నారులను పరామర్శిస్తున్న చెట్టి వినయ్, నాయకులు

అనంతగిరి: మండలంలోని కొత్తూరు పంచాయతీ కేంద్రానికి చెందిన అక్షర, అక్షిత ఇద్దరు చిన్నారులు డెంగ్యూ జ్వరంతో విశాఖ కేజీహెచ్‌లో చికిత్స పొందుతున్నారు. విషయం తెలుసుకున్న వైఎస్సార్‌సీపీ యువజన విభాగ రాష్ట్ర కార్యదర్శి చెట్టి వినయ్, సోమవారం కేజీహెచ్‌కు వెళ్లి, చిన్నారులను పరామర్శించారు. కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. చిన్నారులకు మెరుగైన వైద్యసేవలను అందించాలని, వైద్యాధికారులను కోరారు. మండల సర్పంచ్‌ల ఫోరం మాజీ అధ్యక్షుడు రేగబోయిన స్వామి, మార్కెట్ కమిటీ డైరెక్టర్ కొర్రా సూర్యనారయణ, నాయకులు గంగులు, లక్ష్మణరావు, గంగరాజు తదితరులున్నారు.

మంత్రి దృష్టికి సమస్యలు

విశాఖపట్నం సర్క్యూట్ హౌస్‌లోని సోమవారం పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్‌ను వైఎస్సార్‌సీపీ యువజన విభాగం రాష్ట్ర కార్యదర్శి చెట్టి వినయ్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలో పలు సమస్యలను తెలియజేశారు. గిరిజన నిరుద్యోగులను దృష్టిలో ఉంచుకొని, అరకులోయ నియోజకవర్గంలో పరిశ్రమలను ఏర్పాటు చేసే విధంగా కృషి చేయాలని మంత్రికి విన్నవించారు.

లోకులగాంధీ సేవలు మరువలేనివి



లోకులగాంధీ విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నేతలు

కొయ్యూరు: శరభన్నపాలెంలో బీజేపీ నాయకుడు లోకులగాంధీ రెండో వర్ధంతి సోమవారం నిర్వహించారు. ఇందులో భాగంగా ఏర్పాటు చేసిన రక్తదాన శిబిరానికి ఎక్కువ మంది వచ్చి రక్తదానం చేశారు. దీంతో పాటు సికిల్‌సెల్ ఎనిమియా పరీక్షలను నిర్వహించారు. కార్యక్రమానికి హాజరైన మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్‌రాజు, మాజీ ఎమ్మెల్సీ మాధవ్, గొలుగొండ, కొయ్యూరు జెడ్పీటీసీ సభ్యులు గిరిబాబు, నూకరాజు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ లోకులగాంధీ సేవలు మరువలేనివన్నారు. ఆయన ఆశయ సాధనకు కృషి చేయాలన్నారు. అనంతరం లోకులగాంధీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. నేతలు రాజారావు, పరుశరామ్ రాజ్, ఉమామహేశ్వరరావు, ఏఎంసీ చైర్మన్ జె.రాజులమ్మ, మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ముసిలినాయుడు, తోడు ట్రస్ట్ ప్రతినిధి మురళీకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ఈ–క్రాప్‌పై రైతులకు అవగాహన



గన్నవరంలో ఈ–క్రాప్ నమోదు చేస్తున్న అధికారులు

ఎటపాక: రైతులు సాగు చేసుకుంటున్న పంటలను ఈ–క్రాప్‌లో తప్పనిసరిగా నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి రాబిన్ సుదర్శన్ సూచించారు. మండలంలోని గన్నవరం సచివాలయంలో పరిధిలో పంటల నమోదు కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన రైతులకు తగు సూచనలు చేశారు. పంటల నమోదు యాప్‌లో కొత్త సాఫ్ట్‌వేర్ అందుబాటులో రావడంతో రైతులు సాగుచేసే భూమిలో సర్వే నంబర్లు ఉంటే వాటిని అప్‌లోడ్ చేయాలని సూచించారు. ప్రతీ సర్వే నంబర్ వద్ద జియో కార్డినర్స్ ద్వారా ఫోటో తీయించుకుని ఈ–క్రాప్ బుకింగ్ చేయించుకోవాలన్నారు. అగ్రికల్చర్ అసిస్టెంట్ జింక భార్గవి తదితరులున్నారు.

రేపు మండల సమావేశం

ఎటపాక: మండల ప్రజా పరిషత్ సాధారణ సర్వసభ్య సమావేశం బుధవారం నిర్వహించనున్నట్టు ఎంపీడీవో ప్రేమ్‌సాగర్ సోమవారం తెలిపారు. ఎంపీపీ కాక కామేశ్వరి అధ్యక్షతన ఉదయం 10.30 గంటలకు సమావేశం ప్రారంభమవుతుందని పేర్కొన్నారు.అన్ని ప్రభుత్వ శాఖల అధికారులు వారి శాఖల అభివృద్ధి నివేదికలతో సకాలంలో హాజరు కావాలని కోరారు. సర్పంచ్‌లు, ఎంపీటీసీలు ఇతర ప్రజాప్రతినిధులు సమావేశానికి రావాలని తెలిపారు.

గ్రామాల్లో ఆధార్ సెంటర్లు



ఎంపీడీవో ఉమామహేశ్వరరావు

గూడెంకొత్తవీధి: మండలంలోని మెండిగెడ్డ, దేవరాపల్లి పంచాయతీల్లో ఆధార్ సెంటర్ల సేవలు మంగళవారం అందుబాటులో వస్తాయని ఎంపీడీవో ఉమామహేశ్వరరావు తెలిపారు. ఇప్పటి వరకు సంకాడ, రింతాడ–2 ఉన్న ఈ సెంటర్లు మెండిగెడ్డ, దేవరాపల్లిలో కూడా ఏర్పాటు చేశామని, గ్రామస్తులు సేవలను సద్వినియోగం చేసుకోవలసిందిగా ఆయన కోరారు.

విద్యుత్ కనెక్షన్‌కు ఆధార్ అనుసంధానం తప్పనిసరి

ముంచంగిపుట్టు: విద్యుత్ కనెక్షన్‌లకు ఆధార్ నంబర్ అనుసంధానం చేసుకోవాలని విద్యుత్ శాఖ ఏఈఈ జి.రాంబాబు అన్నారు. ఆయన సోమవారం విలేకరులతో మాట్లాడుతూ ఈ మేరకు విద్యుత్ కనెక్షన్‌కు ఆధార్ అనుసంధానం కోసం స్థానిక లైన్‌మెన్‌కు సంప్రదించి, వినియోగదారుడి ఆధార్ కార్డు, కరెంట్ బిల్లు నకలు అందించాలన్నారు. విద్యుత్ మీటర్లలో పేర్లు మార్పులు, చేర్పులు చేసుకునే అవకాశం సైతం ఉందన్నారు. మరిన్ని వివరాలకు 1912 నెంబర్‌కు ఫోన్ చేయవచ్చని సూచించారు.

గ్రామాల్లో ఏఎంసీ స్ప్రేయింగ్

హుకుంపేట: గ్రామల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తగా స్ప్రేయింగ్ పనులు నిర్వహిస్తున్నట్టు స్థానిక పీహెచ్‌సీ విస్తరణ అధికారి కోడ మహేష్ అన్నారు. సూకురు పంచాయతీ కేంద్రాంతో పాటు నడింవీధి గ్రామల్లో ఇంటింటా ఏఎంసీ స్ప్రేయింగ్ చేయించారు. ఆయన మాట్లాడుతు అన్ని సచివాలయ కేంద్రాల్లో రెండవ విడతగా స్ప్రేయింగ్ చేయిస్తున్నట్టు తెలిపారు. సూపర్‌వైజర్ సాంబశివరావు, సిబ్బంది పాల్గొన్నారు.

మొక్కలతో పర్యావరణ పరిరక్షణ



మొక్కలు నాటుతున్న ప్రిన్సిపాల్ శ్రీనివాస్

చింతపల్లి: స్థానిక డిగ్రీ కళాశాలలో సోమవారం జరిగిన నా మట్టి – నా దేశం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్ పాత్రుడు మాట్లాడుతూ మొక్కలను నాటి పర్యావరణాన్ని పరిరక్షించుకోవాలన్నారు. వైస్ ప్రిన్సిపాల్ రమణ, ఉపాధ్యాయులు కేజీయా, ఎన్ఎస్ఎస్ యూనిట్ ప్రోగ్రామ్ ఆఫీసర్లు ఈశ్వర్, పూర్ణ, రవి, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

మహిళల ఆర్థిక స్వావలంబనకు పెద్దపీట



మహిళలకు రుణాల చెక్కును అందజేస్తున్న ఎంపీపీ సీతమ్మ, అధికారులు, ప్రజాప్రతినిధులు

ముంచంగిపుట్టు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మహిళల ఆర్థిక స్వావలంబనకు పెద్దపీట వేస్తున్నారని ఎంపీపీ అరిసెల సీతమ్మ అన్నారు. మండల కేంద్రంలో వెలుగు ఏపీఎం దేవమంగ ఆధ్వర్యంలో సోమవారం 115 మహిళా సంఘాలకు బ్యాంకు లింకేజి రుణాల ద్వారా మంజూరైన రూ.1.23కోట్ల చెక్కును ఎంపీపీ అరిసెల సీతమ్మ, ఎంపీడీవో రమేష్, సర్పంచులు, ఎంపీటీసీల చేతుల మీదగా సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా ఎంపీపీ సీతమ్మ మాట్లాడుతూ మహిళల సాధికారత కోసం ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. మహిళల భద్రత, ఆర్థికాభివృద్ధి కోసం ప్రభుత్వం పని చేస్తోందని, రుణాలు అందిస్తూ మహిళల ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేస్తోందన్నారు. ప్రభుత్వం మహిళలకు అందిస్తున్న అమ్మఒడి, వైఎస్సార్ ఆసరా, వైఎస్సార్ చేయూత తదితర పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వైస్ ఎంపీపీలు సత్యనారాయణ, భాగ్యవతి, సర్పంచ్‌లు సుభాష్, గంగాధర్, నీలకంఠం, బాబూరావు, భాగ్యవతి, మిల్కి, వసంత, త్రినాథ్, రత్న, ఎంపీటీసీలు మల్లికార్జున్, సుబ్బలక్ష్మి, కొండమ్మ, నోబ్బో తదితరులు పాల్గొన్నారు.

సచివాలయాల్లో ఆకస్మిక తనిఖీలు



రికార్డులు తనిఖీ చేస్తున్న తహసీల్దార్ శ్రీనివాసరావు

వై.రామవరం: మండలంలోని కోట, యర్రంరెడ్డిపాలెం గ్రామాల సచివాలయాల్లో తహసీల్దార్ సీహెచ్.శ్రీనివాసరావు సోమవారం ఆకస్మిక తనిఖీలు చేశారు. సచివాలయాల రికార్డులను పరిశీలించారు. జగనన్న సురక్ష కార్యక్రమంలో వచ్చిన దరఖాస్తులను, వివిధ రకాల ధ్రువీకరణ పత్రాల అర్జీలను తనిఖీ చేశారు. వాటి వివరాల ఆన్‌లైన్‌పై సిబ్బందిని అడిగి తెలుసుకున్నారు. గ్రామ వలంటీర్ల పనితీరుపై ఆరా తీశారు. సిబ్బంది పనితీరును పరీక్షించి, ప్రజలకు మెరుగైన సేవలు అందించే విధానంపై సలహాలు సూచనలిచ్చారు. అనంతరం కోట గ్రామ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. అక్కడ విద్యార్థులకు అందించిన ఆహారాన్ని రుచి చూశారు. వంటగదిలో ఉన్న నిత్యావసర వస్తువుల నాణ్యతను పరిశీలించారు. మెనూను తనిఖీ చేశారు. విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న మెనూను తప్పనిసరిగా అమలు చేయాలని హెచ్ఎం వెంకట్‌రెడ్డి, వార్డెన్‌లకు సూచించారు. కార్యక్రమాల్లో నచివాలయాల సిబ్బంది, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

వాడివేడిగా మండల సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ సీతమ్మ

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో ఎంపీడీవో కార్యాలయా సమావేశ మందిరంలో ఎంపీపీ అరిసెల సీతమ్మ అధ్యక్షతన మండల సర్వ సభ్య సమావేశం సోమవారం జరిగింది. శాఖల వారీగా మండల స్థాయి అధికారులు జరుగుతున్న అభివృద్ధి పనులను వివరించారు. ఎంపీపీ సీతమ్మ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు మాట్లాడుతూ ముంచంగిపుట్టు మండల కేంద్రంలో ప్రభుత్వ భూములకు రక్షణ లేకుండా పోయిందని, ప్రభుత్వ భూముల్లో అక్రమ నిర్మాణాలపై రెవెన్యూ అధికారుల దృష్టికి తీసుకువెళ్లిన కనీస స్పందన కరువుతుందని డీటీ మత్స్యరాజును సభ్యులు నిలదీశారు. ప్రభుత్వ పథకాలపై అధికారుల పర్యవేక్షణ కొరవడడం, గ్రామాల్లో జరిగే అభివృద్ధి పనుల్లో ప్రజా ప్రతినిధులకు సమాచారం ఇవ్వకపోవడంపై సభ్యులు ప్రశ్నలు సంధించారు. ముఖ్యంగా మారుమూల గ్రామాల్లో కొన్ని పాఠశాలల్లో ఉపాధ్యాయులు విధులకు హాజరు కావడం లేదని, మారుమూల గ్రామాల విద్య పరిస్థితి ఈ విధంగా ఉంటే ఎలా అని రంగబయలు సర్పంచ్ దనియా విద్యాశాఖ అధికారులను నిలదీశారు. ఎన్ఆర్ఈజీఎస్, వెలుగు, పిఆర్, ఐసిడిఎస్, నాడు–నేడు పనులకు సంబంధించిన శాఖలపై సభలో వాడి వేడి చర్చ జరిగింది.ఈ సందర్భంగా ఎంపీపీ సీతమ్మ మాట్లాడుతూ మండల స్థాయి అధికారులు శాఖల వారీగా జరుగుతున్న అభివృద్ధి పనులను కచ్చితంగా స్థానిక సర్పంచ్, ఎంపీటీసీలకు తెలియజేయాలన్నారు. అభివృద్ధి పనులపై పర్యవేక్షణ నిరంతరం చేయాలని, ప్రభుత్వ భూములు పరిరక్షించాలని, రానున్న సమావేశానికి కచ్చితంగా అన్ని శాఖల మండల స్థాయి అధికారులు హాజరు కావాలన్నారు. వైస్ ఎంపీపీలు సత్యనారాయణ, భాగ్యవతి, ఎంపీడీవో రమేష్, ఏవో శ్రీనివాస్‌బాబు, జీసీసీ మేనేజర్ మోహన్, పీఆర్ ఏఈఈ గోపాలకృష్ణ, వైద్యాధికారులు రమేష్, శ్యాంప్రసాద్, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, పలు శాఖల అధికారులు పాల్గొన్నారు.

సేంద్రియ కషాయాలతో పంటలకు మేలు



నాట్లు వేస్తున్న రైతులకు సూచనలు చేస్తున్న ఏవో ఉమాదేవి



రాచపాలెంలో ఎరువుల తయారీని వివరిస్తున్న వ్యవసాయ శాఖ సిబ్బంది, పక్కన ఎంపీపీ ఆనందరావు

కొయ్యూరు: గదబపాలెం పంచాయతీ కొత్తూరులో సోమవారం ఏవో ఉమాదేవి ఆధ్వర్యంలో పొలంబడిని నిర్వహించారు. వరి నాట్లు వేస్తున్న రైతుల వద్దకు వెళ్లి నాట్లు వేసే ముందు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు. దమ్ములో పది కిలోల యూరియా తరువాత నెల రోజులకు మరో 25 కిలోల యూరియా వేయాలన్నారు. నాట్లు సమయంలో ఆకు కొనలను కత్తిరించాలని, ఎకరానికి లీటరు వేపనూనెను పిచికారీ చేస్తే పురుగును నివారించవచ్చని సూచించారు. డొనూరు ఎంపీటీసీ సభ్యుడు బి.అప్పారావు మాట్లాడుతూ వ్యవసాయ అధికారుల సూచనలను రైతులు పాటించాలన్నారు. ఎలాంటి అనుమానాలున్నా నేరుగా వారిని సంప్రదించాలని సూచించారు.

సేంద్రియ కషాయం తయారీపై శిక్షణ

వై.రామవరం: మండలంలోని పనసలపాలెం సచివాలయం పరిధిలోని రాచపాలెం గ్రామంలో సోమవారం ప్రకృతి వ్యవసాయశాఖ ఆద్వర్యంలో 16 రకాల ఆకులతో చీడపీడల నివారణలో భాగంగా సేంద్రియ కషాయం తయారీపై రైతులకు శిక్షణ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ కడబాల ఆనందరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఆయన సమక్షంలో ఆశాఖ సిబ్బంది ఆధ్వర్యంలో చీడపీడలు నివారణకు పంటలపై పిచికారీ చేయుటకు 200 లీటర్ల సేంద్రియ కషాయాన్ని ప్రయోగాత్మకంగా తయారు చేయించారు. ఈ కషాయాన్ని అన్నిరకాల పంటలపై పిచికారీ చేస్తే, చీడపీడలు పూర్తిగా నివారణ అవుతాయని ఆశాఖ సిబ్బంది రైతులకు తెలియజేశారు. పిచికారీ చేసే విధానంపై అవగాహన కల్పించారు. ప్రభుత్వం ఉచితంగా ప్రజలకు అందిస్తున్న ఈ పథకాన్ని మండలంలోని రైతులంతా సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ కోరారు.ప్రకృతి వ్యవసాయ శాఖ సిబ్బంది కామేష్, అమ్మోజి, సత్యవతి, నారాయణమ్మ తదితరులు పాల్గొన్నారు.

గోడౌన్ పనులకు భూమిపూజ



గోడౌన్ నిర్మాణ పనులకు భూమిపూజ చేస్తున్న తహసీల్దార్ అప్పలస్వామి

జి.మాడుగుల: మండలంలో సింగర్బ పంచాయతీ ఎం.నిట్టాపుట్టు గ్రామంలో గిరిజన సంస్థకు ఉద్యావన శాఖ మంజూరు చేసిన గోడౌన్ భవనం నిర్మాణ పనులను తహసీల్దార్ కె.అప్పలస్వామి సోమవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ రైతులు పండించే పంటకు యాజమాన్య పద్ధతులపై అవగాహన కల్పించి గిట్టుబాటు ధర వచ్చేలా రైతు సంస్థలు కృషి చేయాలని కోరారు. ప్రభుత్వం నుంచి రైతు సంస్థలకు సహాయ సహకారాలు అందించటానికి సిద్ధంగా ఉన్నట్టు ఆయన తెలిపారు. టెక్నో సర్వే సభ్యులు, హార్టికల్చర్ అధికారి కెబీ కిరణ్, టెక్నో సర్వే సభ్యులు ప్రసంగించారు. మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షుడు ఎస్.రామకృష్ణ, రైతు సాధికార సంస్థ సీఈవో పరదాని గంగరాజు, సింగర్బ సర్పంచ్ కొండమ్మ, ఎంపీటీసీ లక్ష్మి, నాయకులు గంగరాజు, చిట్టిబాబు తదితరులు పాల్గొన్నారు.